సాక్షి ఆదిలాబాద్

మంగళవారం । 2 । మే । 2023



టూరిస్ట్ బస్ సీజ్ 8లో▸

నకిలీనంబర్‌తో వెళ్తున్న టూరిస్ట్ బస్సును సీజ్ చేసినట్లు డీటీసీ శ్రీనివాస్ తెలిపారు. హైదరాబాద్ నుంచి వారణాసికి వెళ్తున్న వాహనాన్ని ఆదిలాబాద్ వద్ద పట్టుకున్నట్లు పేర్కొన్నారు.



ఘనంగా మేడే

జిల్లా వ్యాప్తంగా మేడే వేడుకలను సోమవారం ఘనంగా నిర్వహించారు. పలు పార్టీలు, కార్మిక సంఘాల ఆధ్వర్యంలో జెండా ఆవిష్కరించారు. 9లో▸



గరిష్టం/కనిష్టం 32.0/22.0

వాతావరణం

ఆకాశం మేఘావృతమై ఉంటుంది. పలుచోట్ల ఓ మోస్తరు వర్షం కురిసే అవకాశం ఉంది. ఈదురుగాలులు వీస్తాయి.

న్యూస్‌రీల్

జిల్లా కేంద్రంలో వర్షం

కైలాస్‌నగర్: ఆదిలాబాద్ పట్టణంలో సోమవారం మళ్లీ వర్షం కురిసింది. వారం పది రోజులుగా జిల్లా కేంద్రంలో భిన్న వాతావరణ పరిస్థితులు నెలకొన్నాయి. పగటి పూట ఎండ, రాత్రి వేళలో వర్షం కురుస్తుంది. సోమవారం సాయంత్రం కురిసిన వర్షానికి మార్కెట్‌కు వచ్చిన జనం తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. మరోవైపు అకాల వర్షాలతో రైతుల అవస్థలు వర్ణనాతీతంగా మారాయి.

'కేసీఆర్‌కు రుణపడి ఉంటాం'



సీఎం కేసీఆర్ ఫ్లెక్సీకి క్షీరాభిషేకం చేస్తున్న లెక్చరర్లు

ఆదిలాబాద్‌టౌన్: కాంట్రాక్టు లెక్చరర్లను రెగ్యులర్ చేస్తూ సీఎం కేసీఆర్ ఫైల్‌పై సంతకం చేయడం హర్షనీయమని పలువురు అధ్యాపకులు పేర్కొన్నారు. ప్రభుత్వ నిర్ణయంపై హర్షం వ్యక్తం చేస్తూ సోమవారం జిల్లా కేంద్రంలోని కుమురంభీం చౌక్‌లో సీఎం కేసీఆర్ ఫ్లెక్సీకి క్షీరాభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. జిల్లాలో 124 మంది కాంట్రాక్ట్ లెక్చరర్లను ప్రభుత్వం క్రమబద్ధీకరిస్తూ ఉత్తర్వులు జారీ చేయడంపై హర్షం సంతోషం వ్యక్తం చేశారు. తామంతా సీఎం కేసీఆర్‌కు రుణపడి ఉంటామన్నారు. కార్యక్రమంలో సంఘం నాయకులు గాజుల శ్రీనివాస్, సంజీవ్ రెడ్డి, దేవేందర్, సూర్యకాంత్ తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలి



వైద్య పరీక్షలను పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్

ఎదులాపురం: కార్మికులు ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలని అదనపు కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ అన్నారు. కార్మిక దినోత్సవం సందర్భంగా భవన నిర్మాణ కార్మిక సంఘం ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని సంఘ భవనంలో ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరంను సోమవారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. ఆరోగ్య విషయంలో కార్మికులు శ్రద్ధ చూపాలన్నారు. పరిశుభ్రత పాటించడంతో పాటు పోషకాహారం తీసుకోవాలన్నారు. మూడురోజుల పాటు కొనసాగనున్న శిబిరాన్ని కార్మికులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. అనంతరం కార్మికులను వైద్యులు పరీక్షించారు. ఇందులో అసిస్టెంట్ లేబర్ కమిషనర్ శ్రావణి, కార్మిక సంఘం అధ్యక్షుడు పోతన్న, వైద్యులు, కార్మికులు, తదితరులు పాల్గొన్నారు.

'పుర ప్రజావాణి'లో మార్పు

కైలాస్‌నగర్: ఆదిలాబాద్ పట్టణ ప్రజల సమస్యల పరిష్కారం కోసం ప్రతీ మంగళవారం మున్సిపల్ సమావేశ మందిరంలో నిర్వహిస్తున్న పుర ప్రజావాణి కార్యక్రమంలో మార్పు చేసినట్లు మున్సిపల్ కమిషనర్ శైలజ ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 9 నుంచి పట్టణంలోని ఆయా వార్డుల పరిధిలోనే ప్రజావాణి నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. పట్టణ వాసులు గమనించి సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

5న ఫుడ్ ఫెస్టివల్

ఆదిలాబాద్: ఈనెల 5న ఫుడ్ ఫెస్టివల్ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు జిల్లా యువజన క్రీడల అధికారి వెంకటేశ్వర్లు ప్రకటనలో పేర్కొన్నారు. జిల్లా కేంద్రంలోని గాంధీపార్కులో గల మినీ ఓపెన్ థియేటర్‌లో వేసవి మిల్లెట్స్‌తో పాటు పాటల పోటీని శుక్రవారం సాయంత్రం 5 గంటలకు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఐసీడీఎస్ ఆధ్వర్యంలో మిల్లెట్స్ ఫుడ్, సేల్స్ ఉంటాయని పేర్కొన్నారు. పాటల పోటీలో పాల్గొనదలచిన వారు జిల్లాకు చెందిన వారై ఉండాలని తెలిపారు. ఆసక్తి గల వారు 93813 03380, 7989014581 నంబర్ల ద్వారా తమ పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు.

దరఖాస్తుల ఆహ్వానం

ఆదిలాబాద్‌రూరల్: ఎస్సీ స్టడీ సర్కిల్ ఆధ్వర్యంలో వివిధ పోటీ పరీక్షలకు సంబంధించి ఐదు నెలల పాటు అందించనున్న ఉచిత శిక్షణకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా ఎస్సీ అభివృద్ధి శాఖ అధికారి సునీత కుమారి, స్టడీ సర్కిల్ డైరెక్టర్ రమేశ్ ప్రకటనలో తెలిపారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ విద్యార్థులు ఈనెల 1నుంచి 14 వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు. ఆర్‌ఆర్‌బీ, ఎస్‌ఎస్‌సీ, బ్యాంకింగ్ వంటి పోటీ పరీక్షలకు ఈ శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. శిక్షణ సమయంలో వసతితో పాటు రూ.2,500 విలువ చేసే స్టడీ మెటీరియల్ అందించనున్నట్లు పేర్కొన్నారు. వివరాల కోసం 93987 84343, 90009 67211 నంబర్లలో సంప్రదించాలని కోరారు.



జిల్లాలో దెబ్బతిన్న జొన్న పంటను పరిశీలిస్తున్న వ్యవసాయ అధికారులు



అకాల నష్టం



ఇక్కడ జొన్నపంటను చూపిస్తున్న రైతు కేమ రామయ్య. తాంసి మండలంలోని వడ్డాడి గ్రామం. ఈ యాసంగి సీజన్‌లో ఎనిమిదెకరాల్లో జొన్న సాగుచేశాడు. రూ.80వేల వరకు పెట్టుబడి పెట్టాడు. మరో 15 రోజులయితే పంట చేతికొచ్చేది. అయితే ఇటీవల కురిసిన ఈదురుగాలులతో కూడిన వర్షంతో పంటంతా ఇలా నెల కొరిగింది. పూర్తిగా దెబ్బతింది. తడిసిన కంకులు మొలకలు కూడా వస్తున్నాయని రైతు ఆవేదన వ్యక్తం చేస్తున్నాడు.



ఇక్కడ కనిపిస్తున్న రైతు రాథోడ్ దినేష్. ఈయనది ఇచ్చోడ మండలం దాబా–కే గ్రామం. ఈ సీజన్‌లో ఐదెకరాల్లో జొన్న, ఐదెకరాల్లో వేరుశనగ, రెండెకరాల్లో నువ్వు పంట వేశాడు. అకాల వర్షాలకు జొన్న పంటంతా నేలకొరిగింది. నువ్వు పంట కూడా దెబ్బతింది. రూ.3లక్షల వరకు నష్టం వాటిల్లిందని ఈ రైతు వాపోతున్నాడు. ప్రభుత్వం స్పందించి ఆదుకోవాలని వేడుకుంటున్నాడు.

ఇక్కడ నేలకొరిగిన జొన్న పంట తలమడుగు మండలంలోని భరంపూర్ గ్రామానికి చెందిన రైతులు స్వామి, రమేశ్‌లది. వీరిద్దరూ తొమ్మిదెకరాల్లో పంట సాగు చేశారు. నాలుగు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు పంట మొత్తం కిందపడిపోయింది. తడిసి ముద్దవుతుండటంతో చేతికొచ్చే పరిస్థితి కనిపించడం లేదు. అలాగే పంటంతా నల్లబడిపోయింది. అప్పులు చేసి పంట సాగు చేస్తే చివరికి ఇలా అయిందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వమే తమను ఆదుకోవాలని కోరుతున్నారు. వీరే కాదు జిల్లాలో చాలా మంది రైతులు అకాల వర్షాలతో పంటలు దెబ్బతిని తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

- జిల్లాలో భారీ వర్షాల ప్రభావం
- 2,833 ఎకరాల్లో దెబ్బతిన్న పంటలు
- అంచనా వేస్తున్న వ్యవసాయశాఖ

ఆదిలాబాద్‌టౌన్: అకాల వర్షాలు అన్నదాతను అతలాకుతలం చేస్తున్నాయి. జిల్లాలో ఇటీవల కురుస్తున్న భారీ వర్షాలతో చాలా చోట్ల పంటలు నేలకొరిగి దెబ్బతిన్నాయి. ప్రధానంగా జొన్నపై తీవ్ర ప్రభావం కనిపిస్తుంది. గడిచిన పది రోజుల్లో రైతులు రెండోసారి పంటలు నష్టపోవాల్సిన దుస్థితి. ఈదురుగాలులతో కూడిన వడగళ్లతో మామిడి కాయలు నేలరాలుతున్నాయి. చేతికొచ్చిన పంట కళ్లముందే నీటిపాలు కావడంతో రైతులు కన్నీరుమున్నీరవుతున్నారు. వేలాది ఎకరాల్లో పంట నష్టపోవడంతో తేరుకోలేక పోతున్నారు. వానాకాలంలో కురిసిన అధిక వర్షాలకు పత్తి, సోయా నష్టపోయిన విషయం విదితమే. కనీసం ఈ యాసంగి పంటలైనా మేలు చేస్తాయనుకుంటే ఈ సారీ అదే పరిస్థితి.

జిల్లాలో 2,833 ఎకరాల్లో పంట నష్టం..

ఈ యాసంగిలో మొక్కజొన్న, జొన్న, నువ్వులు, వరి, మామిడి, మినుములు, పెసర, వేరుశనగ సాగయ్యాయి. ఇందులో జొన్న ఎక్కువగా దెబ్బతింది. అత్యధికంగా తలమడుగు మండలంలోనే రైతులకు తీవ్ర నష్టం వాటిల్లింది. రెండు, మూడు రోజుల్లో కురిసిన అకాల వర్షాలకు జిల్లాలో 2,833 ఎకరాల్లో పంట నష్టం వాటిల్లినట్లు వ్యవసాయ అధికారుల ప్రాథమికంగా అంచనా వేశారు. ఇదిలా ఉంటే వారం క్రితం కురిసిన వర్షాలకు జిల్లాలో 2,143 ఎకరాల్లో పంట నష్టం వాటిల్లినట్లు అంచనా వేశారు. దాదాపు వారం, పది రోజుల వ్యవధిలోనే ఐదువేల ఎకరాల్లో పంట నష్టం సంభవించింది. గతంలో కూడా తలమడుగు మండలంలోనే అత్యధికంగా 1,239 ఎకరాల్లో పంట నష్టం సంభవించడం గమనార్హం.

కొనసాగుతున్న సర్వే..

జిల్లాలోని ఆయా మండలాల్లో వ్యవసాయ అధికారులు, ఏఈఓలు క్షేత్రస్థాయిలో పంట క్షేత్రాలను సందర్శించి పంట నష్టం వివరాలను నమోదు చేసుకుంటున్నారు. జిల్లా వ్యవసాయ అధికారి తలమడుగు, గుడిహత్నూర్, ఇచ్చోడ, మావల తదితర మండలాల్లో పర్యటించి పంట నష్టం వివరాలను అంచనా వేశారు. నివేదికను ప్రభుత్వానికి అందజేయనున్నట్లు వివరించారు. కాగా క్షేత్రస్థాయికి వెళ్లిన అధికారులను రైతులు తమకు ప్రభుత్వం నుంచి పరిహారం అందేలా చూడాలని వేడుకుంటున్నారు.



మార్కగూడలో తడిసి మొలకెత్తిన్న జొన్న కంకి

మొలకెత్తిన జొన్న..

తాంసి: మండలంలోని పలు గ్రామాల్లో ఆదివారం రాత్రి కురిసిన భారీ వర్షానికి జొన్న పంట నేలవాలింది. పలు చోట్ల కంకులు మొలకెత్తాయి. వడ్డాడి గ్రామంలో చేతికొచ్చిన వేరుశనగ సైతం వర్షానికి తడిసింది. ఆరబెట్టేందుకు రైతులు నానా అవస్థలు పడుతున్నారు.



వడ్డాడిలో తడిసిన వేరుశనగ పంటను ఆరబెడుతున్న రైతులు

సర్వే చేపడుతున్నాం

ఇటీవల కురుస్తున్న వర్షాలకు పంటలు తీవ్రంగా దెబ్బతిన్నట్లుగా తెలుస్తోంది. వసాయాధికారులు క్షేత్రస్థాయికి వెళ్లి దెబ్బతిన్న పంటలను పరిశీలిస్తున్నారు. నష్టాన్ని అంచనా వేస్తున్నారు. ఇప్పటి వరకు జిల్లావ్యాప్తంగా 2,833 ఎకరాల్లో పంట దెబ్బతిన్నట్లుగా గుర్తించాం. పూర్తిస్థాయిలో సర్వే చేపట్టాక వివరాలను ప్రభుత్వానికి నివేదిస్తాం.

– డి.పుల్లయ్య, డీఏవో

మండలం	పంట నష్టం (ఎకరాలు)
మావల	128
తాంసి	150
భీంపూర్‌లో	85
నేరడిగొండలో	115
నార్నూర్‌లో	190
ఇచ్చోడలో	400
సిరికొండలో	85
ఉట్నూర్‌లో	141
తలమడుగులో	1,539

పంటల వారీగా వివరాలు

పంట	నష్టం(ఎకరాలు)
మొక్కజొన్న	60
జొన్న	2588
నువ్వులు	89
వరి	32
మామిడి	38
మినుములు	20
పెసర	3
వేరుశనగ	3

అర్జీలు సత్వరమే పరిష్కరించాలి

- అదనపు కలెక్టర్ రిజ్వాన్ బాషా



సమస్యలు తెలుసుకుంటున్న అదనపు కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్

కైలాస్‌నగర్: ప్రజావాణిలో అందించే అర్జీలు సత్వరమే పరిష్కరించాలని అదనపు కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ అన్నారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణిలో జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చిన బాధితుల నుంచి అదనపు కలెక్టర్ నటరాజ్‌తో కలిసి అర్జీలు స్వీకరించారు. భూ సంబంధ, ఉపాధి, పింఛన్, విద్య, వైద్యం, డబుల్‌బెడ్‌రూం ఇళ్ల మంజూరు వంటి సమస్యలపై ఎక్కువ అర్జీలు అందాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. దరఖాస్తులను పెండింగ్‌లో ఉంచకూడదన్నారు. క్షేత్ర స్థాయిలో పరిశీలించి సత్వర పరిష్కారానికి చర్యలు తీసుకోవాలన్నారు. అర్జీదారు ఒకే సమస్యపై పలు మార్లు ప్రజావాణికి రాకుండా స్పష్టమైన సమాచారం అందించాలన్నారు. కార్యక్రమంలో ఆర్డీవో రమేశ్ రాథోడ్, జెడ్పీ సీఈఓ గణపతి, మున్సిపల్ కమిషనర్ శైలజ తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి దివ్యాంగులకు బస్‌పాస్‌ల పంపిణీ

- మండలాల వారీగా తేదీలు ఖరారు

కైలాస్‌నగర్: జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో జిల్లాలోని దివ్యాంగులకు ఆర్టీసీ ద్వారా బస్‌పాస్‌లు అందించేందుకు మండలాల వారీగా తేదీలను ఖరారు చేసినట్లు డీఆర్డీవో కిషన్ ప్రకటనలో తెలిపారు. ఈ నెల 2న ఆదిలాబాద్ రూరల్, 3న బేల, 4న భీంపూర్, 5న బజార్‌హత్నూర్, 6న బోథ్, 8న గాదిగూడ, 9న గుడిహత్నూర్, 10న ఇంద్రవెల్లి, 11న ఇచ్చోడ, 12న జైనథ్, 15న మావల, 16న నార్నూర్, 17న నేరడిగొండ, 18న సిరికొండ, 19న తలమడుగు, 20న తాంసి, 22న ఉట్నూర్‌లో పంపిణీ చేయనున్నట్లు పేర్కొన్నారు. ఆయా ఎంపీడీవో కార్యాలయాల్లో వీటిని అందజేయనున్నట్లు తెలిపారు. ఎంపీడీవోలు, ఏపీఎంలు తమ పరిధిలోని అర్హులైన దివ్యాంగులు నిర్ణీత తేదీల్లో ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 3గంటల వరకు హాజరయ్యేలా సీసీలు, పంచాయతీ కార్యదర్శులు, ఫీల్డ్‌అసిస్టెంట్లకు ఆదేశాలు జారీ చేయాలని పేర్కొన్నారు. సదరం సర్టిఫికెట్ ఒరిజినల్, జిరాక్స్, ఆధార్ జిరాక్స్, దివ్యాంగ వ్యక్తి ఫొటో, రూ.50 రుసుంతో హాజరై పాస్‌లను పొందాలని ఆయన సూచించారు.

కదం తొక్కిన ఆదివాసీలు



కలెక్టరేట్ ఎదుట బైఠాయించిన ఆదివాసీలు

- ఇళ్ల పట్టాల కోసం ఆందోళన
- జిల్లా కేంద్రంలో భారీ ర్యాలీ
- కలెక్టరేట్ ఎదుట బైఠాయింపు

కైలాస్‌నగర్: జిల్లాకేంద్రంలోని సర్వేనంబర్ 72లో నివసిస్తున్న తమకు ఇంటిపట్టాలు ఇవ్వాలనే డిమాండ్‌తో ఆదివాసీలు సోమవారం ఆందోళన చేపట్టారు. తుడుందెబ్బ ఆధ్వర్యంలో వందలాదిగా తరలివచ్చి కదం తొక్కారు. మావల మండలం బట్టిసావర్‌గాం శివారు కుమురంభీం కాలనీ నుంచి కలెక్టరేట్ వరకు భారీ ర్యాలీ చేపట్టారు. సంప్రదాయ వాయిద్యాలు వాయిస్తూ కలెక్టరేట్ ఎదుట బైఠాయించి నిరసన వ్యక్తం చేశారు. నినాదాలతో హోరెత్తించారు. ఈ సందర్భంగా తుడుందెబ్బ జిల్లా అధ్యక్షుడు గొడం గణేశ్ మాట్లాడారు. నిరుపేదలైన ఆదివాసీలు ఎండ, వానను సైతం లెక్కచేయకుండా గుడిసెల్లో జీవిస్తున్నారన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు స్పందించి వారికి జీవో 58 ప్రకారం ఇంటి పట్టాలు అందించాలని డిమాండ్ చేశారు. అలాగే కాలనీలో తాగు నీరు, విద్యుత్, విద్య, వైద్యం వంటి మౌలిక సౌకర్యాలు కల్పించాలన్నారు. లేని పక్షంలో ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడుతామని హెచ్చరించారు. అనంతరం అదనపు కలెక్టర్ నటరాజ్, ఆర్డీవో రమేశ్ రాథోడ్‌కు వినతిపత్రం అందజేశారు. అంతకు ముందు కాలనీలో మేడే పురస్కరించుకుని జెండా ఆవిష్కరించారు. కార్యక్రమంలో సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఉయిక సంజీవ్, నాయకులు జలపతి, బాపురావు, శ్యాంరావు, వెట్టి మనోజ్, రేణుక, ఇందిరా తదితరులు పాల్గొన్నారు.



గేటుకు వేసిన తాళం



నిరీక్షిస్తున్న ఉద్యోగులు, గ్రీవెన్స్‌కు వచ్చిన అర్జీదారులు

తప్పని నిరీక్షణ

ఇంటి స్థలాలకు పట్టాలు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ కలెక్టరేట్ ఎదుట ఆదివాసీలు సోమవారం నిరసన చేపట్టారు. ఈ క్రమంలో ఎలాంటి ఉద్రిక్త పరిస్థితులు చోటు చేసుకోకుండా పోలీసులు పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశారు. కలెక్టరేట్‌లోని ఇన్, అవుట్ గేట్లకు తాళాలు వేశారు. ఈ క్రమంలో మధ్యాహ్న సమయంలో భోజనానికి ఇళ్లకు వెళ్లేందుకు వచ్చిన కార్యాలయ ఉద్యోగులు, సిబ్బంది, అర్జీదారులకు నిరీక్షణ తప్పలేదు.

– సాక్షి,ఫొటోగ్రాఫర్, ఆదిలాబాద్

సీఎంకు జేపీఎస్‌ల సమ్మె కనిపించట్లేదా..?

- సర్కారు తీరుపై ఎంపీ సోయం ఆగ్రహం



జేపీఎస్‌లకు మద్దతు తెలిపిన ఎంపీ సోయం బాపూరావు, తదితరులు

కైలాస్‌నగర్: ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం ఏర్పడితే ధర్నాలు, సమ్మెలుండవని చెప్పిన సీఎం కేసీఆర్‌కు జూనియర్ పంచాయతీ కార్యదర్శుల సమ్మె కనిపించడం లేదా అని ఎంపీ సోయం బాపూరావ్ ప్రశ్నించారు. తమ సర్వీస్‌ను క్రమబద్ధీకరించాలనే డిమాండ్‌తో జేపీఎస్‌లు కలెక్టరేట్ ఎదుట చేపట్టిన సమ్మె నాలుగో రోజుకు చేరింది. సర్కారు తీరును నిరసిస్తూ సోమవారం కళ్లకు గంతలతో నిరసన వ్యక్తం చేశారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు పాయల్ శంకర్, జిల్లా అధికార ప్రతినిధి లోక ప్రవీణ్‌రెడ్డితో కలిసి సమ్మెశిబిరాన్ని సందర్శించిన ఎంపీ వారి సమ్మెకు మద్దతు ప్రకటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. సీఎం కేసీఆర్ జూనియర్ పంచాయతీ కార్యదర్శులకు ఇచ్చిన హామీలు విస్మరించి పాలన సాగిస్తున్నారన్నారు. కాంట్రాక్ట్ కార్మికులను రెగ్యులర్ చేసిన కేసీఆర్ జేపీఎస్‌లను ఎందుకు విస్మరించారని ప్రశ్నించారు. తక్షణమే రెగ్యులరైజ్ చేయాలని డిమాండ్ చేశారు. విషయాన్ని కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి, పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ దృష్టికి తీసుకెళ్లి రాష్ట్రస్థాయిలో ఉద్యమిస్తామని భరోసానిచ్చారు. కార్యక్రమంలో జేపీఎస్‌ల సంఘం అధ్యక్షుడు చంద్రశేఖర్, అరుణ్‌కుమార్, జ్యోతి, రంజిత్, లక్ష్మీప్రియ, గంగన్న తదితరులు పాల్గొన్నారు. సమ్మెకు మాజీ ఎంపీ, బీజేపీ నాయకుడు రాథోడ్ రమేశ్ మద్దతు తెలిపారు. అలాగే బీఆర్‌ఎస్ సర్పంచ్‌లు సదానంద్, వెంకన్న, బీఆర్‌ఎస్ నాయకులు పి.కృష్ణ తదితరులు సైతం మద్దతు పలికారు.

కవులు సామాజిక చైతన్యానికి ప్రతీకలు

ఆదిలాబాద్: కవులు సామాజిక చైతన్యానికి ప్రతీకలని జిల్లాకు చెందిన ప్రముఖ కవి ఉదారి నారాయణ అన్నారు. జిల్లా కేంద్రంలోని పెన్షనర్స్ భవనంలో సోమవారం అంతర్జాతీయ కార్మిక దినోత్సవం సందర్భంగా టీఎస్‌యూటీఎఫ్ ఆధ్వర్యంలో సామాజిక కవి సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కవులు శ్రామిక జీవనాన్ని ప్రతిబింబించేలా కవితలు రాయాలని సూచించారు. నేటి యువత కవిత రచనపై ఆసక్తి కనబర్చడం అభినందనీయమన్నారు. కవులు బాబన్న, రాఘవేంద్ర దారవేణి, త్రివేణి, అరుణ, రహమాన్ వినిపించిన కవితలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో టీఎస్ యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి వెంకట్, జిల్లా అధ్యక్షుడు స్వామి, పెన్షనర్స్ సంఘం అధ్యక్షుడు లక్ష్మారెడ్డి, నారాయణ తదితరులు పాల్గొన్నారు.

పారిశుధ్య కార్మికుల సేవలు వెలకట్టలేనివి

- జిల్లా జడ్జి వీఆర్‌ఆర్ వరప్రసాద్

కైలాస్‌నగర్: పారిశుధ్య కార్మికులు అందిస్తున్న సేవలు వెలకట్టలేనివని జిల్లా ప్రధాన న్యాయమూర్తి సీహెచ్ వీఆర్‌ఆర్.వరప్రసాద్ అన్నారు. ప్రపంచ కార్మిక దినోత్సవం సందర్భంగా జిల్లా న్యాయ సేవా అధికార సంస్థ ఆధ్వర్యంలో మున్సిపల్ కార్మికులకు సోమవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. మున్సిపల్ కౌన్సిల్ సమావేశ మందిరంలో నిర్వహించిన కార్యక్రమానికి జిల్లా జడ్జి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. పట్టణాన్ని పరిశుభ్రంగా ఉంచుతున్న పారిశుధ్య కార్మికుల సేవలను ప్రతి ఒక్కరూ గుర్తించాలన్నారు. అలాగే కార్మికులు తమ పిల్లల భవిష్యత్‌పై దృష్టి సారించి వారిని ఉన్నతంగా చదివించాలని సూచించారు. కష్టపడి చదివితే ప్రతి ఒక్కరూ మంచి స్థానంలో ఉండవచ్చన్నారు. కార్యక్రమంలో ఎస్సీ, ఎస్టీ కోర్టు న్యాయమూర్తి పి.శివప్రసాద్, డీఎల్‌ఎస్‌ఏ కార్యదర్శి క్షమా దేశ్‌పాండే, జూనియర్ సివిల్ జడ్జి మంజుల, స్పెషల్ జేఎఫ్‌సీఎం జడ్జి యశ్వంత్‌సింగ్ చౌహాన్, మున్సిపల్ కమిషనర్ శైలజ, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు నగేశ్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జిల్లా జడ్జి వరప్రసాద్

క్లుప్తంగా

హోంగార్డుకు మెమో

భైంసాటౌన్: బాసర దేవస్థానంలో హోంగార్డుగా పనిచేస్తున్న దిలీప్‌కుమార్‌కు మెమో జారీ చేసినట్లు ఆలయ ఈవో విజయరామారావు ఒక ప్రకటనలో తెలిపారు. అమ్మవారి దర్శనం కోసం భక్తుల నుంచి డబ్బులు వసూలు చేస్తున్నట్లు రుజువైందని, ఈ మేరకు మెమో ఇచ్చినట్లు పేర్కొన్నారు. కాగా, ఇప్పటివరకు సంజాయిషీ రాలేని కారణంగా చర్యలు తీసుకుంటామన్నారు.

కిక్‌బాక్సింగ్ విజేతగా మంచిర్యాల జిల్లా



మెమెంటో అందిస్తున్న మున్సిపల్ వైస్ చైర్మన్ ముఖేశ్‌గౌడ్

మంచిర్యాలటౌన్: జిల్లా కేంద్రంలో నిర్వహిస్తున్న రాష్ట్రస్థాయి కిక్ బాక్సింగ్ పోటీల విజేతగా మంచిర్యాల జిల్లా గెలుపొందింది. రాష్ట్రస్థాయి నుంచి వివిధ జిల్లాల క్రీడాకారులు పాల్గొనగా, విజేతగా మంచిర్యాల జిల్లా, రన్నర్‌గా నిర్మల్ జిల్లా, మూడో స్థానంలో జగిత్యాల జిల్లా గెలుపొందింది. విజేతలకు మున్సిపల్ వైస్ చైర్మన్ గాజుల ముఖేశ్‌గౌడ్, కిక్ బాక్సింగ్ రాష్ట్ర అధ్యక్షుడు రామాంజనేయులు, జిల్లా అధ్యక్షుడు సుదమల్ల హరికృష్ణ, ప్రధాన కార్యదర్శి శ్రీలత, రాష్ట్ర కార్యదర్శి మైపాల్‌లు మెమెంటోలు అందజేశారు.

బాసరవాసికి దళితరత్న అవార్డు

భైంసాటౌన్: బాసర మండలం ఓని గ్రామానికి చెందిన గౌతమ్‌కు దళితరత్న అవార్డు వరించింది. సామాజిక సేవ, కళా రంగంలో నైపుణ్యం కలిగినవారికి రాష్ట్రప్రభుత్వం అంబేద్కర్ జయంతిని పురస్కరించుకుని అవార్డులు ప్రకటించింది. ఈ మేరకు గతనెల 30న నిజామాబాద్ జిల్లా బోధన్‌లో నిర్వహించిన కార్యక్రమంలో బీఎస్పీ ప్రధాన కార్యదర్శి ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్, ఆకునూరి మురళి, జీవీ రాజు చేతులమీదుగా అవార్డు అందుకున్నారు. అంబేద్కర్ జీవితచరిత్ర, శివాజీ, సావిత్రీబాయి పూలే జీవితచరిత్రపై పాటలు పాడడంతోపాటు కళానైపుణ్యంతో చేసిన సామాజిక సేవకుగాను అవార్డు వరించినట్లు గౌతమ్ పేర్కొన్నారు.

7న ఆదివాసీ భారత మహా ద్వితీయ జాతీయ సమావేశం



పోస్టర్ ఆవిష్కరిస్తున్న నాయకులు

ఆదిలాబాద్‌రూరల్: జిల్లా కేంద్రంలోని రెవెన్యూ గార్డెన్‌లో ఈనెల 7న నిర్వహించే ఆదివాసీ భారత మహా ద్వితీయ జాతీయ సమావేశం నిర్వహిస్తున్నట్లు రాష్ట్ర అధ్యక్షుడు గేడం మనోహర్ తెలిపారు. జిల్లా కేంద్రంలో సోమవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఏబీఎం సమావేశ పోస్టర్‌ను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమావేశానికి దేశంలోని పలు రాష్ట్రాలకు చెందిన ఏబీఎం ముఖ్య నేతలు హాజరవుతారని తెలిపారు. ఈ సమావేశంలో ఆదివాసీల సమస్యలు, ఇతర చర్చించనున్నట్లు పేర్కొన్నారు. సర్పంచ్, ఏబీఎం జిల్లా ప్రధాన కార్యదర్శి గేడం వినోద్, పార్డి అనిల్, సంస్కృతిక కార్యదర్శి గేడం మనోజ్, మహిళా నాయకురాలు ఆత్రం సుశీల తదితరులు పాల్గొన్నారు.

పేకాటస్థావరంపై దాడి

నర్సాపూర్(జి): మండలంలోని బామిని(బి) శివారులోని రామాయికుంట చెరువు వద్ద సోమవారం సాయంత్రం స్పెషల్ పోలీసు బృందం పేకాటస్థావరంపై దాడి చేశారు. ఎనిమిది మందిని అదుపులో తీసుకుని వారి వద్ద నుంచి రూ.5200 నగదు స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై పాకాల గీత తెలిపారు.

అకాల వర్షం.. అపార నష్టం



హాజీపూర్ మండలం టీకానపల్లిలో తడిసిన ధాన్యం ఆరబోస్తున్న దుర్గం పుష్పలత



చిత్తాపూర్‌లో నేలరాలిన మామిడి కాయలు



కొనుగోలు కేంద్రాల్లో పేరుకుపోయిన ధాన్యం, తడిసిన ధాన్యం



నెన్నెల: గంగారాంలో నేలకొరిగిన వరిపంట



కోటపల్లి మండలం ఎసన్‌వాయిలో..



కొండపల్లిలో నేలకొరిగిన వరి పంట

ఆదిలాబాద్ ఉమ్మడి జిల్లాలో అకాల వర్షాలు..రైతులకు అపార నష్టాన్ని మిగుల్చుతున్నాయి. గతమూడు రోజులుగా ఈదురుగాలులతో కురుస్తున్న భారీ వర్షాలకు వరి, మొక్కజొన్న, జొన్న, నువ్వులు, శనగ, పెసర, మామిడి పంటలకు తీవ్ర నష్టం వాటిల్లింది. చేతికందిన మామిడికాయలు రాలగా, వరి పంటలు నేలకొరిగింది. కళ్లముందే పంటలు నేలపాలు కావడంతో రైతులు ఆవేదన చెందుతున్నారు. కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం తడిసింది. కొన్నిచోట్ల రోడ్లపైకి ధాన్యం కొట్టుకొచ్చింది. ఇప్పటివరకు వేల ఎకరాల పంటలకు తీవ్ర నష్టం వాటిల్లింది. - సాక్షి నెట్‌వర్క్



ఆదిలాబాద్ జిల్లాలో దెబ్బతిన్న పంటలను పరిశీలిస్తున్న వ్యవసాయ అధికారులు



హాజీపూర్ మండలంలోని కొనుగోలు కేంద్రాల్లో కొట్టుకుపోయిన ధాన్యం



బెల్లంపల్లిలో విద్యుత్ తీగలపై విరిగిపడ్డ చెట్లు

మర్డర్ మిస్టరీ వీడేనా..!



హత్యకు గురైన అశ్వినితో భర్త రమేశ్



చిన్నారులు లోకేష్, సునాక్షి

- ముమ్మరంగా దర్యాప్తు
- మిస్టరీ కొలిక్కి వచ్చినట్లు సమాచారం

గుడిహత్నూర్: సీతాగోంది సమీపంలోని గర్కంపేట్ వద్ద జరిగిన జంట హత్యల కేసులో పురోగతి కనిపిస్తున్నట్లు తెలుస్తోంది. జిల్లా కేంద్రంలో భుక్తాపూర్‌కు చెందిన మహమ్మద్ రహమాన్ (20), సుందరయ్య నగర్‌కు చెందిన వివాహిత సోన్‌కాంబ్లే అశ్విని (28) హత్యకు గురైన విషయం తెలిసిందే. ఈ హత్యోదంతం జిల్లావ్యాప్తంగా కలకలం రేపింది. ఆదివారం మృతదేహాలను గుర్తించిన పోలీసులు క్లూస్‌టీం, డాగ్ స్క్వాడ్‌తో సంఘటనా స్థలాన్ని జల్లెడపట్టి ఆధారాలు సేకరించారు. ఇరు మృతదేహాలకు సంఘటనా స్థలంలో స్థానిక సర్పంచ్ ధనలక్ష్మి సమక్షంలో పంచనామా నిర్వహించి రిమ్స్‌కు తరలించారు. కాగా, ఆదివారం రహమాన్ మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి కుటుంబ సభ్యులకు అందజేశారు. కాని అశ్విని మృతదేహానికి సోమవారం ఉదయం పోస్టుమార్టం నిర్వహించి బంధువులకు అందజేయగా వారు అంత్యక్రియలు పూర్తి చేశారు.

కుటుంబ సభ్యుల పాత్రపై ఆరా..

వివాహేతర సంబంధం నేపథ్యంలో హతుల సెల్ ఫోన్ డాటాతో పాటు దొరికిన ఆధారాలను క్రోడీకరించి పోలీసు ఉన్నతాధికారుల పర్యవేక్షణలో దర్యాప్తు ముమ్మరం చేసినట్లు సమాచారం. హత్యోదంతం బయటపడ్డ రోజు సంఘటనా స్థలానికి అశ్విని కుటుంబీకులు రాకపోవడం పలు అనుమానాలు రేకెత్తించింది. దీంతో ఈ జంట హత్యల్లో అశ్విని కుటుంబ సభ్యుల పాత్ర ఉందా అనే కోణంలో పోలీసులు దర్యాప్తు చేస్తున్నట్లు సమాచారం. ఈ క్రమంలో అశ్విని భర్త, అశ్విని తమ్ముడిని అదుపులో తీసుకుని విచారిస్తున్నట్లు తెలిసింది. హత్యకు గురైన ఇరువురిని అత్యంత దారుణంగా హత్య చేసినట్లు మృతదేహాలపై ఉన్న గాయాలున్నాయి. అయితే ఈ జంట హత్య చేయడానికి ఎంత మంది పాలుపంచుకున్నారు? అసలు హతులు గర్కంపేటకు సమీపంలో ఉన్నట్లు సమాచారం ఎవరు అందించారు? హత్యకు ముందు వీరి మధ్య వాగ్వాదా లు జరిగాయా? లేదంటే ముందస్తుగా హత్య చేయాలని పథకం ప్రకారం వీరిని వెంబడించి ఈ దారుణగానికి పాల్పడ్డారా? అనే విషయమై జిల్లా వాసులు ఆసక్తిగా చర్చించుకుంటున్నారు. కాగా మంగళవారం ఈ హత్యోదంతంపై పోలీసు ఉన్నతాధికారులు వివరాలు వెల్లడించే అవకాశం ఉన్నట్లు తెలు స్తోంది. అయితే హత్యకు గురైన అశ్విని, హత్యారోపణ ఎదుర్కొంటున్న భర్త రమేశ్ జైలుకు వెళ్తే చిన్నారులు లోకేష్ (8) సునాక్షి (4) అనాథలుగా మిగిలిపోనున్నారు.


టూరిస్ట్ బస్ సీజ్



నకిలీ నంబర్‌తో టూరిస్ట్ బస్సు

ఆదిలాబాద్‌టౌన్: నకిలీ నంబర్‌తో వెళ్తున్న టూరిస్ట్ బస్సును సీజ్ చేసినట్లు డిప్యూటీ ట్రాన్స్‌పోర్ట్ కమిషనర్ పుప్పాల శ్రీనివాస్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. సోమవారం హైదరాబాద్ నుంచి వారణాసికి టీఎస్31టీఏ1577 నంబర్ గల టూరిస్ట్ బస్సు నకిలీ నంబర్‌తో వెళ్తుంది. సమాచారం అందుకుని చెక్‌పోస్టు సిబ్బందిని అప్రమత్తం చేసినట్లు తెలిపారు. తెల్లవారుజాము ఆదిలాబాద్ చెక్ పోస్టు వద్ద సిబ్బంది వెంబడించి పట్టుకున్నారు. బస్సును ఆదిలాబాద్ ఆర్టీసీ డిపోకు తరలించారు. ముందుగానే పిప్పర్‌వాడ టోల్ గేట్ వద్ద సిబ్బందిని ఉంచాలని ఆదేశించారు. డ్రైవర్ చెక్‌పోస్టు వద్ద వాహనాన్ని ఆపకుండా వెళ్లడంతో ఎంవీఐ రాహుల్ కుమార్, ఏఎంవీఐ మధు వెంబడించారు. టోల్‌గేట్ సమీపంలో బస్సును పట్టుకొని చెక్‌పోస్టుకు తరలించారు. పత్రాలను పరిశీలించడంతో పాటు వాహనంపై ఉన్న చేజిస్ నంబర్, రిజిస్ట్రేషన్ సర్టిఫికేట్‌లో ఉన్న నంబర్‌తో సరిపోకపోవడంతో వాహనాన్ని సీజ్ చేసినట్లు డీటీసీ వివరించారు.

గోదావరిలోకి దూకి మహిళ ఆత్మహత్య



అలేఖ్య మృతదేహం

సోన్: సోన్ సమీపంలోని గోదావరిలో దూకి సోమవారం ఓ మహిళ ఆత్మహత్యకు పాల్పడింది. పోలీసుల కథనం ప్రకారం.. నిర్మల్ జిల్లా కేంద్రంలోని చింతకుంటవాడకు చెందిన మెంగ అలేఖ్య(32) భర్తతో విడాకులు తీసుకుంది. తల్లితో కలిసి ఉంటుంది. మొబైల్ విషయంపై తల్లితో గొడవ జరగడంతో మనస్తాపం చెంది సోన్‌లోని జాతీయ రహదారి పాత బ్రిడ్జిపై నుండి గోదావరిలోకి దూకింది. గమనించిన పలువురు పోలీసులకు సమాచారం ఇవ్వడంతో ఎస్సై రవీందర్ ఘటన స్థలానికి చేరుకుని మృతదేహాన్ని వెలికితీయించారు. తల్లి ఫిర్యాదుతో కేసు నమోదు చేసుకుని పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

కేజీబీవీలకు సెలవుల్లేనట్లే..!?

- ప్రతిరోజు స్కూల్‌కు రావాలని ఆదేశాలు
- విద్యాశాఖ నిర్ణయాలపై టీచర్ల అసంతృప్తి


ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా..

జిల్లా	కేజీబీవీలు	టీచింగ్	నాన్‌టీచింగ్
మంచిర్యాల	18	193	133
ఆదిలాబాద్	17	230	231
నిర్మల్	18	187	206
కుమురం భీం	15	165	126

మంచిర్యాలఅర్బన్: రాష్ట్రప్రభుత్వం ఏప్రిల్ 25 నుంచి విద్యాసంస్థలకు సెలవులు ప్రకటించింది. ఇదివరకు సెలవుల్లో విద్యాసంస్థలు అడ్మిషన్లు చేపట్టినా కఠిన చర్యలు తప్పవని విద్యాశాఖ హెచ్చరికలు జారీ అయ్యాయి. ఇంతలోనే నిబంధనలు తుంగలో తొక్కి పేద, వెనుకబడిన మధ్యలో బడి మానేసినా బాలికల కోసం ఏర్పాటు చేసిన కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాల (కేజీబీవీల) టీచర్లను బడులకు రావాలని ఆదేశాలు జారీపై గందరగోళం నెలకొంది. మునుపెన్నడూలేని విధంగా ఏ పాఠశాలల యాజమాన్యాల్లో లేని ఆంక్షలు కేజీబీవీలో విధులు నిర్వహించే నాన్‌టీచింగ్, నాన్‌టీచింగ్‌పై విధించడంపై అసంతృప్తి వ్యక్తమవుతోంది. పిల్లలందరూ ఇంటిపట్టున ఉంటే టీచర్లంతా బడికి వెళ్లాలనే హుకుంపై పెదవి విరుస్తున్నారు. ఓ వైపు ప్రభుత్వం కాంట్రాక్టు ఉద్యోగులు, అధ్యాపకులను పర్మినెంట్ ప్రక్రియ చేపట్టగా..ఇంకోవైపు కేజీబీవీల్లో కాంట్రాక్టు విధులు నిర్వహిస్తున్న టీచర్ల క్రమబద్ధీకరణ మాటదేవుడెరుగు వేసవి సెలవులు అమలు చేయకపోవడంపై టీచర్లు వాపోతున్నారు.

బడికి వెళ్లాల్సిందే..

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఉన్న కేజీబీవీల్లో టీచింగ్, నాన్‌టీచింగ్ విధులు నిర్వహిస్తున్నారు. విద్యార్థులు లేకపోయినా టీచర్లు బడికి వెళ్లి విధులు నిర్వహించాలని జూమ్ మీటింగ్ ద్వారా సూచించారు. టీచర్లు మే 31 వరకు సమ్మర్ యాక్షన్ ప్లాన్ చేయాలని విద్యాశాఖ అధికారులు ప్రకటించారు. వీరికి మూడు రకాల విధులు కేటాయించారు. స్కూల్లో ఉంటూ అడ్మిషన్లు చేపట్టడం.. చుట్టుపక్కలా గ్రామాలకు వెళ్లి అడ్మిషన్ల కోసం గ్రామాలకు వెళ్లి ప్రచారం చేపట్టడం .. ఆన్‌లైన్ క్లాస్‌లు నిర్వహించాలని సూచించారు.



కేజీబీవీల్లో టీచర్లు, నాన్‌టీచర్లపై జిల్లాల వారీగా ఏప్రిల్ 28న బయోమెట్రిక్ అటెండెన్స్ గ్రాఫ్

ఇదంతా బాగానే ఉన్నా ప్రతిక్లాస్‌లో 40 మంది చొప్పున విద్యార్థులకు ప్రవేశాలు కల్పిస్తారు. ఆరో తరగతిలో 40 మందికి అవకాశాం ఉంటుంది. మిగిలిన క్లాస్‌లో ఎవరైనా వెళ్లిపోతే ఖాళీలను భర్తీ చేయాల్సి ఉంటుంది. విద్యాసంస్థల పునఃప్రారంభం కాకముందే నిర్దేశిత లక్ష్యం 40 మంది అడ్మిషన్లు పూర్తయి సీట్లు దొరకని పరిస్థితి ఉంటుంది. ఇప్పుడు కొత్తగా గ్రామాలకు వెళ్లి క్యాన్వసింగ్ చేయడం దేనికో అధికారులకు తెలియాలి. ఆన్‌లైన్ క్లాస్‌లు ఇంటిపట్టున ఉండి కూడా నిర్వహించవచ్చని టీచర్లు గుర్తుచేస్తున్నారు. బడులకు ఒకరిద్దరూ వెళ్తే సరిపోతుందని పూర్తిస్థాయిలో టీచర్లు వెళ్లాల్సిన అవసరం లేదనేది సంఘాల అభిప్రాయపడుతున్నాయి. నాన్ టీచింగ్ సిబ్బంది పోపు డబ్బాలు క్లీనింగ్, ప్రాంగణాలు శుభ్రం చేయడం, కిచెన్ గార్డెన్‌కు ఏర్పాట్లు చేసుకోవాలనే చెప్పడం చర్చానీయంశంగా మారింది. అకౌంట్స్ రిపోర్టులు నివేదించడం.. ఏఎన్ఎంలు తప్పనిసరిగా రావాలని సూచించడంపై ఆశ్చర్యానికి గురిచేస్తోంది. సాధారణంగా ఇవన్నీ రోజు వారీ కార్యక్రమాలు కాగా ప్రత్యేకంగా సమ్మర్ యాక్షన్ ప్లాన్ అంటూ పిల్లలు లేకుండా బడులు తెరవాలనే విద్యాశాఖ వింత నిర్ణయాలు టీచర్లు, సంఘాలు తప్పుబడుతున్నారు. ఎప్పటిలాగే కేజీబీవీల్లో పనిచేస్తున్న టీచర్లు, నాన్‌టీచింగ్‌కు సెలవులు అమలు చేయాలని పలువురు కోరుతున్నారు.

సెలవుల్లో విధులు సరికాదు

కేజీబీవీల్లో పనిచేస్తున్న టీచింగ్, నాన్‌టీచింగ్ స్టాఫ్‌ను వేసవి సెలవుల్లో పనిచేయాలనడం సరికాదు. ఉద్యోగులకు సెలవులు అమలు చేయాలి. సెలవుల్లో విధులు నిర్వహించాలనే ఉత్తర్వులు ఉపసంహరించుకోవాలి.

– బగ్గని రవికుమార్, తపస్ ప్రధాన కార్యదర్శి, మంచిర్యాల

ఉన్నతాధికారుల ఆదేశాలతో..

ఉన్నతాధికారుల ఆదేశానుసారం కేజీబీవీల్లో విధులు నిర్వహించే టీచర్లు తప్పనిసరిగా బడికి వెళ్లాలి. యాక్షన్ ప్లాన్ తయారు చేయడం..బయోమెట్రిక్ అటెండెన్స్ వేయాలి.

– పద్మజ, సెక్టోరల్ అధికారి, మంచిర్యాల

'సమరశీల పోరాటాలకు సిద్ధం కండి'

ఆదిలాబాద్‌రూరల్: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆదివాసీ వ్యతిరేక విధానాలపై అవలంబిస్తున్న తీరును ఖండిస్తూ సమరశీల పోరాటాలకు సిద్ధం కావాలని ఆదివాసీ సేన రాష్ట్ర అధ్యక్షుడు కోవ దౌలత్‌రావు పిలుపునిచ్చారు. జిల్లా కేంద్రంలోని పిట్టల్‌వాడలో గల ఆదివాసీ భవనంలో సోమవారం ఆదివాసీ సేన రాష్ట్ర మహాసభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వాలు కవ్వాల్ టైగర్ జోన్, ఓపెన్‌కాస్ట్, సీతమ్మ సాగర్ ప్రాజెక్ట్, ఇతర అభివృద్ధి పేరిట జరుగుతున్న విధ్వంసాలు నిదర్శంగా ఉన్నాయని పేర్కొన్నారు. ఏజెన్సీ ప్రాంతాల్లోని సహజ వనరులను దోపిడీ చేసి బహుళజాతి సంస్థలకు కట్టబెడుతున్నాయని ఆరోపించారు. సమావేశంలో సాయిబాబు, జంగు పటేల్, వెంకట్, అనిల్ కుమార్, తిరుపతి, విశ్వనాథ్, లక్ష్మణ్ పాల్గొన్నారు.

అర్జీలు త్వరగా పరిష్కరించాలి

- ఐటీడీఏ ఏపీవో భీంరావు



అర్జీలు స్వీకరిస్తున్న అధికారులు

ఉట్నూర్‌రూరల్: అర్జీలు త్వరగా పరిష్కరించాలని ఐటీడీఏ ఏపీవో కనక భీంరావు, డీడీ దిలీప్‌కుమార్ పేర్కొన్నారు. ఉట్నూర్ ఐటీడీఏ కార్యాలయ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణిలో గిరిజనుల నుంచి వారు అర్జీలు స్వీకరించారు. ఓఎస్డీ క్రిష్టయ్య, అదనపు వైద్యారోగ్య శాఖ అధికారి కొమురం బాలు, ఏపీవో పీవీటీజీ ఆత్రం భాస్కర్, ఏవో రాంబాబు, జేడీఎం నాగభూషణ్, బీఈడీ కళాశాల పిన్సిపాల్ మనోహర్, డీపీవో ప్రవీణ్ పాల్గొన్నారు.

- ఉట్నూర్ మండలం గంగాపూర్‌లో రోడ్డు, బ్రిడ్జి మంజూరు చేయాలని, భోపాల్ పేట మండలం సిర్పూర్(టి) గ్రామానికి చెందిన సిడాం వెంకటేశ్ భూమి ఇప్పించాలని గ్రామస్తులు అర్జీలు అందజేశారు.
- నర్సింగ్ ఉద్యోగం కల్పించాలని భీంపూర్ మండలం గుంజాలకు చెందిన ఆత్రం రోజా కోరాడు.
- తనకు వైద్య చికిత్స నిమిత్తం ఆర్థికసాయం అందించాలని జైనూర్ మండలం కొండపటార్‌కు చెందిన అయ్యుబాయి విన్నవించారు.

వివాహిత అదృశ్యం

ఆదిలాబాద్‌రూరల్: ఓ వివాహిత అదృశ్యమైన ఘటన సోమవారం ఆదిలాబాద్‌రూరల్ పోలీసుస్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఎస్సై నాగనాథ్ కథనం ప్రకారం..వివాహితకు 2017లో మహారాష్ట్రలోని ఓ గ్రామానికి చెందిన వ్యక్తితో పెళ్లి జరిగింది. నెలరోజుల క్రితం భార్యాభర్తల మధ్య గొడవలు జరిగాయి. దీంతో ఆమె పుట్టింటికి వచ్చింది. కాగా ఆమె తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వివరించారు.